

# పరీక్షల సమయం..

- సబ్జెక్ట్‌పై పట్టు సాధిస్తే ర్యాంకుల పంటే..
- ఒత్తిడికి గురికావద్దు.. ఏకాగ్రత చాలు
- గ్రూప్ స్టడీస్‌తో మంచి ఫలితాలు సాధించవచ్చంటున్న నిపుణులు

# ఆందోళన వద్దు..

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 15 : పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించేవి పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు.. పాఠశాలలు, కళాశాలల్లో హడావిడి మొదలైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్నింటిని మించి తల్లిదండ్రులకు మరింత ఒత్తిడి పెంచింది. సిలబస్ దాదాపుగా పూర్తికావచ్చింది. మళ్లీ పునశ్చరణ తరగతులు, స్లిప్‌టెస్ట్‌ల నిర్వహణ చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు బోధనను కొనసాగిస్తున్నారు. దీంతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుంది. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఈ మాత్రం చదువులు కొనసాగించాల్సిందేనన్న భావనతో ముందుకెళ్తున్నారు. పరీక్షల్లో ప్రతిభను చూపాలనే తపన విద్యార్థుల్లో ఉండాలి. చదువుతున్న సబ్జెక్టుపై పూర్తిస్థాయి పట్టుసాధించాలి. ప్రాథమిక అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించినట్లయితే విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురికారు. ఆందోళన చెందకుండా ఏకాగ్రతతతో చదువుపై దృష్టి సారించాలి. ముఖ్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేశారు.

## సరైన సమయం తెల్లవారుజామునే..

- ప్రతిరోజూ చదువుకు పది గంటల, నిద్రకు ఏడుగంటల సమయం కేటాయించుకోవాలి.
- వేకువజామున 5–7 గంటల మధ్య చదివిన పాఠ్యాంశాలు మామూలు సమయంలో 10గంటలు చదివిన దానితో సమానం.
- ఇప్పటివరకు చదివిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలి.
- పదో తరగతి విద్యార్థులు అధిక మార్కులు సాధించేందుకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కూడా చాలా ముఖ్యమైనవి.
- పరీక్షలకు ముందు నిర్వహించే ప్రీఫైనల్ పరీక్షలను తప్పనిసరిగా రాయాలి. ఫైనల్ పరీక్షలకు ఇవి ప్రయోజనం చేస్తాయి.
- సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండడం మంచిది.
- ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు అర్థం కాకుంటే మళ్లీ అడుగాలి.
- లక్ష్యాన్ని సాధించుకోవాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలి. అప్పుడే లక్ష్యం సాధ్యమవుతుంది.
- విద్యార్థులపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. పిల్లలకు ధైర్యం చెప్పి వారిని ఉత్తేజ పర్చాలి.
- గత పరీక్షల నుంచి వస్తున్న ప్రశ్నలను పరిశీలించి వాటికి తగినట్లుగా చదువుకోవాలి.
- ప్రణాళికాబద్ధంగా చదువుతో పాటు గ్రూప్‌స్టడీస్ ప్రోత్సహించాలి.
- ర్యాంకులు సాధించాలనే ధ్యాసలో పిల్లలు నిద్రకు ఆహారానికి దూరం కాకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- విద్యార్థుల మానసిక స్థితిని అంచనా వేసి పాఠ్యాంశాలను బోధించాలి.
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి తరగతులను నిర్వహించాలి.
- అండగా మేమున్నామనే భరోసా పిల్లలకు ఇవ్వడం ఎంతైనా అవసరం.

## ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం..



జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులను ప్రారంభించాం. ఉదయం. సాయంత్రం వేళల్లో తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా సబ్జెక్టుల వారీగా బోధిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత, మంచి గ్రేడ్‌లు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

– సుశిందర్‌రావు, జిల్లా విద్యాధికారి



# 23న సామూహిక, వ్యక్తిగత పోటీలు

వికారాబాద్, డిసెంబర్ 15 : 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు, సామూహిక, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమంతరావు శుక్రవానం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాస్థాయిలో వేడుకలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయికి పంపించాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన అంబేద్కర్ భవన్ వికారాబాద్‌లో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభం కానుండగా, ప్రతిభ చూపిన యువజన కళాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. యువజనోత్సవాల్లో పాల్గొనే కళాకారులు 15 నుంచి 29 ఏళ్ల వయసులోపు ఉండాలని, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన కళాకారులను జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శనలు, జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్ ఒక్కో బృందంలో 10 మంది మాత్రమే ఉండాలని, ప్రదర్శనలో జానపద నృత్యాలు భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలన్నారు. ప్రదర్శనకు 15 నిమిషాల సమయం మాత్రమే ఇస్తారని, జానపద నృత్యం (ఫోక్ డ్యాన్స్ సోలో) ఒక్కో బృందంలో ఐదుగురు మాత్రమే ఉండాలని సూచించారు. నృత్య ప్రదర్శన సమయం 7 నిమిషాలు మాత్రమే నిని, జానపద గేయాలు(ఫోక్ సాంగ్ (గ్రూప్) ఒక్కో బృందంలో అందరు కలిపి 10 మంది వరకు మాత్రమే ఉండాలని తెలిపారు. సినిమా పాటలను అనుమతించరని, ప్రదర్శన సమయం 7 నిమిషాలు మాత్రమే నని, జానపద గేయాలు (ఫోక్ సాంగ్ సోలో) ఒక్కో బృందంలో ఐదుగురు మాత్రమే ఉండాలన్నారు. గ్రూప్ విభాగాల్లో మొత్తం యువకులు, యువతులు లేదా యువతీ యువకులు ఉండవచ్చునని, వాయిద్య పరికరాలు వారే తెచ్చుకోవాలని, లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యమిస్తారన్నారు. వ్యక్తిగత ప్రదర్శనలు? వ్యాసరచన పోటీలు(స్టోరీ రైటింగ్) ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లంలో 60 నిమిషాల్లో రాయాల్సి ఉంటుందన్నారు. ఒకసారి ఎంపిక చేసిన అంశం మార్చేందుకు వీలులేదు? పోస్టర్ మేకింగ్ (పెయింటింగ్) చేసేందుకు 90 నిమిషాల సమయం ఇస్తారని తెలిపారు. పెయింటింగ్ సామగ్రి తెచ్చుకోవాలని, వకృత్వ పోటీలు, అభ్యర్థులు లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లంలో 3 నిమిషాల్లో మాట్లాడాలని తెలిపారు. ఫొటోగ్రఫీలో పాల్గొనేవారు రెండు ఫొటోగ్రాఫ్స్ మొబైల్, కెమెరాతో పాటు ప్రింట్లు తీసుకురావాలన్నారు.



ఫొటో 1 ఎంబీకి తక్కువ కాకుండా 2 ఎంబీకి ఎక్కువ కాకుండా చూడాలని తెలిపారు. ప్రగతి శీల్ భారత్, ఆత్మ నిర్బర్ భారత్, యోగా, క్రీడలు, శారీరక శ్రమ, ప్రకృతి దృశ్యం వంటి అంశాలలో ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయన్నారు. యువక్రితి యువతీయువకులకు దేశంలోని వివిధ ప్రాంతాల హస్తకళలను అర్థం చేసుకునేందుకు అభినందించేందుకు ప్రత్యేక అవకాశం ఇస్తారన్నారు. హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరీలో గరిష్ఠంగా ఇద్దరిని ఎంపిక చేస్తారని తెలిపారు. యువజనోత్సవాల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు ఈ నెల 19వ తేదీలోగా వివరాలు అందజేయాలన్నారు. స్వయంగా కూడా అందజేయవచ్చునని, ఇతర వివరాలకు 9676638201 ను సంప్రదించాలని వివరించారు.



రాతి స్తంభాలతో ఉన్న ఆలయం ముందు భాగం



ఆలయం ముందున్న నంది



నందివనపర్తిలోని శివాలయం

# ఆహ్లాదం..ఆధ్యాత్మికం

- మహిమాన్విత స్వయంభూ శివలింగం
- అలనాటి అద్భుత కాకతీయ కళాసంపద
- ఆకర్షించేలా పురాతన కోనేరు.. నాగులమ్మ రాతి ప్రతిమలు

## గర్భ గుడిలో శ్రీచక్రం



శివాలయం గర్భగుడిలో భక్తులకు అద్భుతం కనిపిస్తుంది లోపలి నుంచి పైభాగంలో రాతిపైన శ్రీచక్రాన్ని అమర్చడం భక్తులు అద్భుతంగా భావిస్తారు. ఎంతో కళాత్మకంగా రాతితో పైకప్పు భాగానికి శ్రీచక్రాన్ని అమర్చడంతో ఆలయానికి ప్రసిద్ధమైన చరిత్ర ఉందని పూర్వికులు చెబుతుంటారు. శ్రీశైలం మల్లికార్జున ఆలయం, తమిళనాడులోని మదురై మీనాక్షి అమ్మవారి దేవాలయం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో అరుదుగా కనిపించే శ్రీచక్రం ఇక్కడ ఉండడం మహా అద్భుతంగా భావిస్తారు. శ్రీచక్రాన్ని దర్శించుకుంటే పుణ్యం వస్తుందన్న నమ్మకంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## శివలింగాన్ని తాకుతున్న సూర్యకిరణాలు..

శివాలయంలోకి అప్పుడప్పుడు తెల్లవారుజామున సూర్యకిరణాలు ప్రవేశిస్తాయని పూర్వికులు తెలిపేవారు. ఆలయంలోని శివలింగంపై సూర్యకిరణాలు పడటంతో లోతట్టుగా ఉన్న గర్భగుడిలోని శివలింగం సూర్యకాంతి తేజస్సుతో కాంతులీనుతుంది. ఈ ఘటన కేవలం మార్చి నెలలో ఒక్కసారి మాత్రమే చోటు చేసుకుంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ అరుదైన దృశ్యం చుట్టుపక్కల ఎక్కడ చూడలేమంటున్నారు. భూమికి ఐదారడుగుల లోతులో కొలువుదీరిన శివలింగంపై సూర్యకిరణాలు పడడం మహా అద్భుతమంటున్నారు.

## పురాతన కాలంనాటి నాగ ప్రతిమలు..

శివలింగానికి కుడి భాగంలో ఆరు బయట పురాతన కాలంనాటి నాగులమ్మల ప్రతిమలు రాతి బొమ్మలుగా నిలిచాయి. వివిధ ఆకారాల్లో నాగదేవత, నాగుపాముల విగ్రహాలు మహిమగలిగినవని భక్తుల నమ్మకం. ప్రతీ నాగుల చవితి రోజున స్త్రీలు ఆలయాన్ని సందర్శిస్తారు. నాగులమ్మల విగ్రహాలకు ఆవుపాలతో అభిషేకాలు నిర్వహించి, పసుపు కుంకుమల బొట్లతో ఎంతో అందంగా అలంకరిస్తారు. కొబ్బరికాయలు కొట్టి, విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. వీటికి సైతం నిలువ నీడతో పాటుగా ఎలాంటి రక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అలనాటి శిల్ప సంపదను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

అది అతిపురాతనమైన శివాలయం (సిద్దేశ్వరాలయం). ఒకప్పుడు అభిషేకాలు, నిత్యపూజలతో విరాజిల్లిన దేవాలయం, భక్తుల కొంగు బంగారంగా కొలిచే శివాలయ అభివృద్ధిని పట్టించుకునే నాదుడే లేకపోవడంతో అది రోజురోజుకు శిథిలావస్థకు చేరుకుంటుంది. దీంతో అలనాటి కాకతీయుల కళాసంపద క్రమంగా కాలగర్భంలో కలిసిపోతుంది. అత్యంత మహిమాన్వితమైన శివయ్య దర్శన భాగ్యం భక్తులకు కరువయ్యింది. గ్రామంలో నందీశ్వరాలయం, జ్ఞాన సరస్వతీ మందిరం, ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధి చెందగా ఓంకారేశ్వరాలయం సైతం పునర్నిర్మాణం కొనసాగుతుంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం మాత్రం అభివృద్ధికి నోచుకోవడంలేదు. శివరాత్రి, కార్తికపౌర్ణమి, నాగుల పంచమి పర్వదినాలలో ఆలయాన్ని అధిక సంఖ్యలో దర్శించుకుంటారు. ఆలయాన్ని పునర్నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

- యాచారం, డిసెంబర్ 15

## పురాతన కోనేరు.


అలయం ఎదుట కళాత్మకమైన కోనేరును నిర్మించారు. నాలుగు వైపులా మెట్లను ఏర్పాటు చేశారు. ముందుగా కోనేరులో స్నానం చేస్తే పాపాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం. కోనేరును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఆలయానికి సమీపంలోని నంది విగ్రహాన్ని కుక్క నందిగా భావిస్తారు. గ్రామానికి వచ్చే పోయే వారిని గమనిస్తూ కాపలగా ఉంటుందని నమ్మకం. గుప్తనిధులకోసం గతంలో దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి తన సొంత నిధులతో ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించి రెండు గేట్లను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బీఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ఆలయానికి దారిని ఏర్పాటు చేశారు. శివరాత్రి ఉత్సవాలను నిర్వహించి, స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఏటా కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు.

## స్వయంభు శివలింగం..



మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో అక్కన్న, మాదన్నల కాలంలో సుమారు 15వ శతాబ్ద కాలంలో నిర్మించిన అతి పురాతన శివాలయం. పూర్తిగా రాతితో నిర్మించిన ఆలయంలో శివుడు లింగాకారంలో స్వయంభుగా వెలిశాడని ప్రతీతి. రాతి స్తంభాలతో నిర్మించిన అలనాటి శిల్పకళా సంపద దర్శనమిస్తున్నది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా విగ్రహాలు, భారీ శివలింగం, శ్రీశైలంలోని మల్లికార్జున ఆలయంలోని శివలింగాన్ని తలపించడం ఇక్కడి విశేషం. ఆలయానికి మూడు దర్వాజలు కలిగి భూమికి లోతులో గర్భాలయం ఉంటుంది. పూర్తిగా ఏకశిలా బండపై శివలింగం ఉండడం గమనార్హం. గర్భగుడిలో శివలింగం ఎదుట నంది విగ్రహం ఉండగా, బయట మరో నంది విగ్రహం దర్శనమిస్తుంది. ఆలయం అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటుంది. నాడు కళకళలాడిన ఆలయం నేడు కళతప్పి వెలవెల బోతున్నది. శివరాత్రి, కార్తిక పౌర్ణమి, నాగుల పంచమి పర్వదినాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆలయ సమీపంలో నాగు పాము సంచరిస్తుందని, గర్భగుడిలోని శివలింగాన్ని చుట్టుకుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆలయానికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.





కుక్క నంది



## ఆలయ అభివృద్ధికి కృషి..



ఎంతో చరిత్ర కలిగిన శివాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహాయసహకారాలను అందిస్తా. ఇప్పటికే ఆలయానికి దారి లేకపోవడంతో ప్రత్యేక దారిని ఏర్పాటు చేశాం. దేవాదాయ శాఖ శివాలయంపై దృష్టి సారించి అభివృద్ధికి బాటలు వేయాలి. గ్రామస్తులంతా శివాలయం పునర్నిర్మాణానికి కృషి చేయాలి. ఆలయంలో భక్తులకు అన్ని రకాల వసతులను కల్పించాలి. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి.

– బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ (నందివనపర్తి)